అన్నదాతలకు తప్పని తిప్పలు

- కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకుల ఇబ్బందులు
- తాలు, తేమ పేరుతో కొర్రీలు

గార్ల: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల ధాన్యంలో తాలు ఉందని, తేమశాతం రాలేదని, ధాన్యం తూర్పాల పట్టాలని కేంద్రాల నిర్వాహకులు ఇబ్బందులు పెడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఓ పక్క తుపాన్‌తో ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడంతో ఎప్పుడు వర్షం పడుతుందేమోనని రైతులు


కాంటాల కోసం ఎదురు చూస్తున్న రైతులు

ధాన్యం రాసులపై పట్టాలు కప్పుకుంటూ, ధాన్యంను కాంటాలు ఎప్పుడు పెడతారోనని ఎదురు చూస్తున్నారు. కానీ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు మాత్రం ధాన్యం తుర్పాల పట్టాలని, తేమశాతం 17% వచ్చేదాకా కాంటాలు పెట్టలేమంటూ షరతులు విధిస్తున్నారు. అయితే వాతావరణ మార్పులతో ధాన్యంను ఎంత ఆరబెట్టినా తేమ తగ్గడంలదని రైతులు ఆరోపిస్తున్నారు. కొంతమంది రైతులు కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల ఇబ్బందులు తట్టుకోలేక ప్రైవేట్‌లో తక్కువ ధరకు అమ్ముకుంటూ ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా ఎలాంటి షరతులు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పదిరోజులు ఎండబెట్టిన



ధాన్యం ఆరబోసి 10 రోజులు దాటినా.. తేమ 17% రాలేదని, తాలు ఉందని తుర్పాల పోయాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కాంటా పెట్టడం లేదు. తుపానుతో ఎప్పుడు వర్షం వస్తుందేనని ఆందోళనగా ఉంది.
– కాంపాటి శ్రీను, రైతు, గార్ల

షరతులు లేకుండా కాంటా పెట్టాలి



బోనస్ ఇస్తున్నట్లు చెప్పి.. కొనుగోలు కేంద్రాల్లో కొర్రీలు పెట్టడం సరికాదు. ఎలాంటి షరతులు లేకుండా కొనుగోళ్లు వేగంగా చేసి రైతులు నష్టపోకుండా చూడాలి.
– కందనూరి శ్రీనివాసరావు, రైతు, గార్ల

బకాయిలు చెల్లించాకే లెప్రసీ సర్వేలు

- తెలంగాణ ఆశ వర్కర్ల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాధవి

నెల్లికుదురు: ఆశ వర్కర్లకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిల చెల్లించిన తర్వాతనే లెప్రసీ సర్వేలు చేయించాలని తెలంగాణ ఆశ వర్కర్ల రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు పీహెచ్‌సీ వద్ద మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. చాలీచాలని వేతనంతో వెట్టి చాకిరి చేస్తున్న ఆశ వర్కర్లతో చేయించిన గత సర్వేల బకాయి డబ్బులు చెల్లించకుండా మళ్లీ సర్వేలు చేయించడం దారుణమన్నారు. ఈ మేరకు ఈ నెల 4న కలెక్టరేట్ ఎదుట ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సైదులు, బాబు గౌడ్, మహేశ్వరి, ఆదిలక్ష్మి, స్వరూప, సుజాత, కవిత, సునీత పాల్గొన్నారు.
నెహ్రూసెంటర్: ఆశ వర్కర్లకు రావాల్సిన పెండింగ్ బిల్లులను చెల్లించాలని ఆశ వర్కర్స్ యూనియన్


నెల్లికుదురు: మాట్లాడుతున్న కాసు మాధవి

ఏఐటీయూసీ నాయకులు రజిని, రేణుక అన్నారు. అర్బన్ పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు.
కురవి: మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు మంగళవారం ధర్నా నిర్వహించారు. మండల కన్వీనర్ పోతుగంటి మల్లయ్య మాట్లాడారు. కాశీశ్వరి, నిర్మల, సుజాత, హేమలత, కళమ్మ, అరుణ, భద్రకాళీ, విజయ పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్: పేదల అభ్యున్నతే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక బ్రహ్మంగారి దేవాలయం ఆవరణలో స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజీ రుణాల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. పారిశుద్ధ్య కార్మికులను సన్మానించడంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్


చెక్కు అందచేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకన్న, కమిషనర్ రవీందర్, సూర్నపు సోమయ్య, అజయ్‌సారథిరెడ్డి, వేణుమాధవ్, విజయమ్మ, డీఈ సీహెచ్ ఉపేందర్, మేనేజర్ శ్రీధర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత


విద్యార్థులకు స్టడీ మెటీరియర్ అందజేస్తున్న కోట్యానాయక్, తదితరులు

మహబూబాబాద్ అర్బన్: శనిగపురం ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు రోటరీ క్లబ్ వరంగల్ ఆధ్వర్యంలో స్టడీ మెటిరియల్‌ను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కొట్యానాయక్ మంగళవారం అందజేశారు. ప్రధానోపాధ్యాయులు దాశరధి శ్రీధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
కేసముద్రం: పెనుగొండ జెడ్పీహైస్కూల్‌లో 150 మంది విద్యార్థులకు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు మడుపు రవీందర్ ఆధ్వర్యంలో రూ.15వేల విలువైన టై, బ్యాడ్జి, బెల్టులు, ఐడీ కార్డులను మంగళవారం అందజేశారు.
కురవి: బలపాల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు బలపాల పీహెచ్‌సీ వైద్యురాలు స్రవంతి మంగళవారం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.

వైకల్యం దేహానికే.. మనసుకు కాదు


దంతాలపల్లి: మిఠాయి తినిపిస్తున్న హెచ్‌ఎం


డోర్నకల్‌లో..

మహబూబాబాద్/ దంతాలపల్లి/ కురవి/ డోర్నకల్: అంగవైకల్యం దేహానికే కానీ, మనసుకు కాదని, దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని పలువురు పేర్కొన్నారు. మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. ఈనేపథ్యంలో పలువురు మాట్లాడుతూ.. శరీరానికి లోపం ఉన్నంతమాత్రాన బాధ పడొద్దన్నారు. ఈసందర్భంగా వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు పాషా మాట్లాడుతూ.. దివ్యాంగులకు రూ.6,000 ఫించన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

- మున్సిపల్ కమిషనర్ రవీందర్

మహబూబాబాద్: ప్రభుత్వ పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ నోముల రవీందర్ కోరారు. ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం నుంచి మదర్ థెరిసా సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపాలిటి కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులకు వైద్య శిబిరంతోపాటు, చెత్తా చెదారం ఉన్న ప్రాంతాలను శుభ్రం చేసి ముగ్గులు వేశారు. ఈసందర్భంగా కమిషర్ మాట్లాడారు. సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథి


ర్యాలీలో పాల్గొన్న కమిషనర్, కౌన్సిలర్లు

రెడ్డి, సీపీఎం మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సూర్నపు సోమయ్య, డీఈ ఉపేందర్, కౌన్సిలర్లు విజయమ్మ, హరిసింగ్, డీఎంసీ విజయ, మున్సిపల్ మేనేజర్ శ్రీధర్, పర్యావరణ అధికారి క్రాంతి నాయకులు, విద్యార్థులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యమ దివిటి అమరుడు శ్రీకాంతాచారి


మహబూబాబాద్: నివాళులర్పిస్తున్న విశ్వకర్మ ఎంప్లాయీస్ వెల్ఫేర్ కమిటీ బాధ్యులు


కేసముద్రం: నివాళులర్పిస్తున్న ఉద్యమకారులు

మహబూబాబాద్/ కేసముద్రం/మరిపెడ/గార్ల: మలిదశ తెలంగాణ ఉద్యమంలో ఆత్మబలిదానం చేసుకున్న శ్రీకాంతాచారి ఉద్యమ దివిటి అని పలువురు కొనియాడారు. మంగళవారం ఆయన వర్ధంతి సందర్భంగా జిల్లా పలు మండలాల్లో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. శ్రీకాంతాచారి ఆత్మార్పణతో ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిందని గుర్తు చేశారు. ఆయన కుటుంబంలో ఒకరికి ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

అక్రమ నిర్మాణాలు జరగకుండా చూడాలి

- మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి

మహబూబాబాద్: మున్సిపాలిటీ కార్యాలయ భవనానికి కేటాయించిన స్థలంలో అక్రమ నిర్మాణాలు జరకుండా చూడాలని మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రం శివారు అనంతారం రోడ్డులో మున్సిపాలిటీ కార్యాలయ భవన నిర్మాణ పనులు జరుగుతుండగా ప్రహరీని కొంత మంది కూల్చివేశారు. కూల్చివేసిన ప్రహరీని రామ్మోహన్‌రెడ్డితోపాటు వైస్ చైర్మన్ వెంకన్న, సీపీఎం మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సూర్నపు సోమయ్య, సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్


ప్రహరీని పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

అజయ్‌సారథిరెడ్డి, బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ జనార్దన్, కమిషనర్ రవీందర్, డీఈ ఉపేందర్ మంగళవారం సందర్శించారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

- విప్, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

కురవి/మరిపెడ: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడమే సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. డోర్నకల్ నియోజకవర్గానికి మంజూరైన సమీకృత రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలకు మంగళవారం అయ్యగారిపల్లిలో 25 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. ఈనెల 8న శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అయ్యగారిపల్లికి ఇంటిగ్రేటెడ్ గురుకులం మంజూరి చేసినందుకు సీపీఐ తరఫున నల్లు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానిచారు. తహసీల్దార్ సునీల్ కుమార్, ఎంపీడీఓ వీరబాబు, మార్కెట్ చైర్మన్ సుధాకర్, వీరభద్రంగౌడ్ పాల్గొన్నారు.

పదేళ్లలో చేయలేనిది ఏడాదిలో చేశాం

పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ పాలనలో ఏడాదిలో చేసి చూపిం


అధికారులతో మాట్లాడుతున్న రాంచంద్రునాయక్

చామని రాంచంద్రునాయక్ అన్నారు. మరిపెడ మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో మంగళవారం ప్రజాపాలన విజయోత్సవ సభలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మున్సిపాలిటీ కార్మికులకు దుస్తులు పంపిణి చేసి, మాట్లాడారు. మున్సిపాలిటీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్‌తోసహా కౌన్సిలర్లు హాజరుకాలేదు. వైస్‌చైర్మన్ ముదిరెడ్డి బుచ్చిరెడ్డి, 9వ వార్డు కౌన్సిలర్ ప్రగతి శ్రీపాల్‌రెడ్డి హాజరయ్యారు. మున్సిపల్ కమిషనర్ నరేష్‌రెడ్డిని వివరణ కోరగా అందరికీ సమాచారం ఇచ్చామని చెప్పారు.
డోర్నకల్: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ తెలిపారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. మున్సిపాలిటీ ఆవరణలో మున్సిపాలిటీ సిబ్బందికి రాంచంద్రునాయక్ స్వయంగా వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం సిబ్బందికి యూనిఫారం పంపిణీ చేశారు. ఆర్థిక ఇబ్బందులతో రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయామని తెలిపారు. అనంతరం చిలుకోడు, గొల్లచర్ల గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వీరన్న, వైస్ చైర్మన్ కోటిలింగం, పీఏసీఎస్ చైర్మన్ సత్తిరెడ్డి, తహసీల్దార్ కృష్ణవేణి, సీఈఓ సత్తార్, శ్రీనివాస్‌యాదవ్, జగదీష్‌నాయక్, సుమేర్‌చంద్‌జైన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రామలింగేశ్వర స్వామి శోభాయాత్ర

దంతాలపల్లి: పెద్దముప్పారంలో కొలువైన పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి శోభాయాత్ర మంగళవారం గ్రామంలో ఆలయ అర్చకులు పాలంపల్లి రమణశర్మ, పవన్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. అయప్పస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం తనిఖీ

డోర్నకల్: స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని మంగళవారం మున్సిపల్ కమిషనర్ వెంకటస్వామి తనిఖీ చేశారు. ఆధార్ నమోదులో జాప్యం జరగకుండా చూడాలని నిర్వాహకులకు కమిషనర్ సూచించారు.

ధాన్యం బస్తాల అపహరణ

గూడూరు: మండలంలోని బొద్దుగొండ సమీప జాతీయ రహదారి పక్కన ఆరబెట్టిన నింపి ఉంచిన ధాన్యం బస్తాలను గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి అపహరించుకుపోయారు. వివరాల ప్రకారం బొద్దుగొండకు చెందిన రైతు పులుసం నరేశ్ తన అర ఎకరంలో పండిన వరి ధాన్యాన్ని పెట్రోల్‌పంప్ వద్ద ఆరబెట్టాడు. 12 బస్తాలలో నింపి అక్కడే పెట్టి రాత్రి ఇంటికెళ్లాడు. మంగళవారం ఉదయం వెళ్లి చూడగా కనిపించలేదు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రైతు తెలిపాడు.

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు

నెల్లికుదురు: కాంగ్రెస్ ప్రభుత్వం పాలన చేపట్టి సంవత్సరం గడుస్తున్నందున మంగళవారం మండల కేంద్రంలో బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. డీసీసీ ఉపాధ్యక్షుడు గుగులోతు బాలాజీ నాయక్, వెంకటేశ్ యాలాద్రి, యాకసాయిలు, శ్రీను, మౌనేందర్, భాస్కర్ నాయక్ పాల్గొన్నారు.

మెగా వైద్యశిబిరం

నెల్లికుదురు: ప్రగతి సేవాసమితి వ్యవస్థాపకుడు గద్దల జాను ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ సహకారంతో మంగళవారం మండల కేంద్రంలో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. అజరా, లక్ష్మీనర్సింహ, మేద ఆస్పత్రి వైద్యులు పరీక్షలు చేసి మందులు అందజేశారు. వెంకన్న పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు

కేసముద్రం: కేసముద్రంవిలేజ్‌లో ఓ వ్యక్తి తమకు విక్రయించిన ఇంటి స్థలాన్ని, తన కుటుంబ సభ్యుల పేర రిజిస్ట్రేషన్ చేయించి మోసగించాడని ఆరోపిస్తూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు కదిర రాంమోహన్, బండి సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగింత

గార్ల: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను బాధితుడికి మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై జీనత్‌కుమార్ అప్పగించారు. పూసలతండాకు చెందిన భూక్యా కస్నా సెల్‌ఫోన్ అక్టోబర్‌లో చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ ఆపరేటర్ స్వేత సెర్చ్ చేసి, సెల్‌ఫోన్‌ను గుర్తించి, బాధితుడికి తన సెల్‌ఫోన్‌ను అప్పగించారు.

రుణమాఫీ అందరికీ వర్తింపజేయాలి

కురవి: రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షలకు పైగా ఉన్న రైతులందరికీ రుణమాఫీ వర్తింపచేయాలని రైతు సంఘం మండల కార్యదర్శి సుధాకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో మల్లిడి కోటయ్య అధ్యక్షతన నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కట్ల కృష్ణయ్య పాల్గొన్నారు.

నియామకం

మహబూబాబాద్ అర్బన్/కురవి: టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులుగా బానోత్ హరినాయక్, మంజులను ఎన్నుకున్నారు. ఈమేరకు యూనియన్ జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, కురవి మండల ప్రధాన కార్యదర్శి ఎం.ప్రవీణ్‌కుమార్ మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.

కఠినంగా శిక్షించాలి

గార్ల: మండలంలోని సీతంపేటలో నెల క్రితం గుమ్మడి మహేశ్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కనకయ్యను మంగళవారం ఆదివాసీ సంఘం నాయకులు కలిసి విన్నవించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే.. నిందితులు ఎంతటివారైనా వదిలిపెట్టేది లేదని, గార్ల బయ్యారం సీఐతో మాట్లాడి నిందితులకు కఠిన శిక్షలు పడేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

ప్రభుత్వ స్థలాలు స్వాధీనం చేసుకోవాలి

డోర్నకల్: అమ్మపాలెంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోవాలని బీజేపీ నాయకుడు కాపరబోయిన సత్యనారాయణ కోరారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను అమ్మపాలెంలో ఏర్పాటు చేయాలని మంగళవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు.

వ్యక్తిపై కేసు

పెద్దవంగర: చంపుతానని బెదిరింపులకు పాల్పడి ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతి కిరణ్ తెలిపారు. మంగళవారం ఎస్సై వెల్లడించిన వివరాల ప్రకారం.. మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామ పరిధిలోని బొత్తలతండాకు చెందిన మాలోతు రమేశ్ చెల్లెలు కల్యాణితో అదే తండాకు చెందిన జాటోతు రవికి వివాహం జరిగింది. ఈక్రమంలో కుటుంబ సమస్యలతో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. కాగా గత నెల 30న కల్యాణి భర్తను చంపుతానని రమేశ్ బెదించాడు. ఈ విషయంపై ఈ నెల 1న పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీ పెట్టారు. దీంతో కోపోద్రికుడైన రమేశ్, చెల్లి ఇంటికి నిప్పు పెట్టి, బైక్‌ను తగులబెట్టాడు. కల్యాణి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి, రమేశ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

'కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి'

బయ్యారం: ఏజెన్సీలో అనేక సంవత్సరాలుగా జీవిస్తున్న తమను కులం పేరుతో దూషిస్తున్న పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని నారాయణపురం గ్రామానికి చెందిన పలువురు అధికారులను కోరారు. మంగళవారం గ్రామంలో నిరసన తెలిపారు. పంచాయతీ కార్యదర్శి రమేష్ పని తీరును ప్రశ్నిస్తే గిరిజనేతరులు ఏజెన్సీలో ఉండే హక్కు లేదని బెదిరిస్తున్నారని ఆరోపించారు.

లిపిని గుర్తించాలని వినతి

కురవి: లంబాడీ(బంజారా) భాష లిపిని గుర్తించాలని తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం న్యూఢిల్లీలో నేషనల్ కమిషన్ షెడ్యూల్ ట్రైబ్ సభ్యుడు నిరూపంచకర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మానాయక్ మాటాడారు. మాలోత్ కిషన్‌నాయక్, శోభన్, వైష్ణవి, శోభన్, వినోద్ పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు కేటాయించాలి

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు జగ్జీవన్‌రామ్ కాలనీ, కేటీఆర్ కాలనీ అభివృద్ధికి నిధులు కేటాయించేలా చొరవ తీసుకుని అభివృద్ధికి సహకరించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి కోండ్ర ఎల్లయ్య కోరారు. ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పులి శ్రీను, గుట్టయ్య, రాధ, సుధారాణి, దేవి, తదితరులు పాల్గొన్నారు.

కూలి డబ్బులు అందించాలి

కేసముద్రం: ఉపాధి కూలీలకు పెండింగ్‌లో ఉన్న డబ్బులను వెంటనే ఇవ్వాలంటూ మండల కేంద్రంలోని ఎంపీడీఓ ఆఫీస్ ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆ సంఘం జిల్లా నాయకుడు కుర్ర మహేష్ మాట్లాడారు. అనంతరం సూపరింటెంటెంట్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. సంఘం మండల అధ్యక్షుడు నర్సయ్య, కార్యదర్శి వెంకన్న, దర్గయ్య, ఉప్పలయ్య, వెంకటేష్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

దాడులకు వ్యతిరేకంగా పోరాడాలి

గంగారం : మహిళలపై దాడులకు వ్యతిరేకంగా పోరాడుదామని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఊకే పద్మ అన్నారు. గంగారం మండల కేంద్రంలోని ప్రగతిశీల మహిళా సంఘం పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో సమాజంలో మహిళలపై జరుగుతున్న లైంగిక వేదింపులు, ప్రేమోన్మాద, వరకట్నపు దాడులు మహిళలపై అత్యాచారాలు సంబంధించిన విషయాలపై గంగారం మండల కేంద్రంలో మహిళలతో మాట్లాడారు. అనంతరం ప్రగతిశీల మహిళా సంఘం పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో గంగారం టౌన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వజ్జ సమ్మక్క, గంగారం మాజీ ఎంపీటీసీ చింత రమ, సుభద్ర, నర్సక్క, జయసుధ, సుమ్మక్క, రాధిక, రమ, కరుణ, రజిత, బుచ్చమ్మ, శ్యామల పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

కురవి: విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్వీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజేశ్‌నాయక్ అన్నారు. మంగళవారం గురుకులం బాటలో భాగంగా నేరడ గ్రామంలోని మోడల్ పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, కురవిలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించారు. నేరడ మోడల్ స్కూల్‌లో నీటి వసతి కల్పించాలని, కస్తూర్బాగాంధీ పాఠశాలలో టాయ్‌లెట్ల సమస్య తీవ్రంగా ఉందని, ఆశ్రమ పాఠశాలను నూతన భవనంలోకి మార్చాలని ఆయన డిమాండ్ చేశారు. బండి దీపక్ గౌడ్, నాయకుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రాజ్యాంగ సంరక్షణకు ఓటే ఆయుధం

మహబూబాబాద్ అర్బన్: రాజ్యాంగ సంరక్షణకు ఓటే సరైన ఆయుధమని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గంగపుత్ర సంఘం భవనంలో మంగళవారం బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. రాష్ట్ర కార్యదర్శి దార్ల శివరాజ్, జిల్లా ఇన్‌చార్జ్‌లు విజయ్‌కాంత్, దార ప్రసాద్‌రావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంద ప్రభాకర్

క్లుప్తంగా

హోప్ స్టెప్స్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం



మహబూబాబాద్ రూరల్ : దివ్యాంగులకు హోప్ స్టెప్స్ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని డీఎస్పీ తిరుపతిరావు అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో గార్ల మండల దివ్యాంగ బాలికైన గ్రేష్మకు మంగళవారం డీఎస్పీ ఆధ్వర్యంలో వీల్ చైర్ అందజేశారు. సీఐ సర్వయ్య, ఎస్సై దీపిక, ఎస్పీ పీఆర్ఓ కుశల్, హోప్ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు రమేష్, నూతన్ పాల్గొన్నారు.

దోపిడీ విధానాన్ని అరికట్టాలి

గూడూరు: తేమ, నూక, మాచర్ పేర్లతో రైతుల నుంచి అదనంగా దోపిడీ చేసే విధానాన్ని అరికట్టాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ప్రధాన జిల్లా కార్యదర్శి గుజ్జు దేవేందర్, న్యూడెమాక్రసీ సబ్ డివిజన్ నాయకుడు శ్రీశైలం అన్నారు. మండల కేంద్రంతోపాటు బొద్దుగొండలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం సందర్శించారు. లింగన్న, వెంకన్న, నర్సయ్య, వజ్జన్న, యాకయ్య, రామనాథం, వెంకన్న పాల్గొన్నారు.

రోగుల దాహార్తి తీర్చాలి

తొర్రూరు: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగుల దాహార్తి తీర్చాలని పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందాల రంగయ్య అన్నారు. పీవైఎల్ ఆధ్వర్యంలో మంగళవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. పలు సమస్యలపై డాక్టర్ జ్వలితతో మాట్లాడారు. శ్రీనివాస్, సంతోష్, మురళి ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

గార్ల: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర, రూ.500 బోనస్ లభిస్తుందని పీఏసీఎస్ వైస్ చైర్మన్ గంగావత్ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. మంగళవారం పెద్దకిష్టాపురంలో ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి, మాట్లాడారు. ఏఈఓ మేఘన పాల్గొన్నారు.

మహిళా కబడ్డీ జట్టుకు శిక్షణ

కురవి: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ మైదానంలో సోమవారం నుంచి జిల్లా సీనియర్ మహిళా జట్టుకు పీడీ బానోత్ చాంప్లానాయక్ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నారు. ఐదు రోజులపాటు నిర్వహించే ఈ శిక్షణ మంగళవారం కొనసాగింది. కబడ్డీ అసోసియేషన్ సభ్యుడు శ్రీనివాస్, అన్వేష్, అఖిల్ పాల్గొన్నారు.

'వారసులకు ఉద్యోగాలివ్వాలి'

మహబూబాబాద్: వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలివ్వాలని వీఆర్ఏ వారసుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ డిమాండ్ చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం చలో కలెక్టరేట్‌లో భాగంగా తహసీల్దార్ కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, కార్యాలయంలో వినతి అందచేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. జీఓ 81 ప్రకారం 61 సంవత్సరాలు దాటిన వీఆర్ఏ వారసులలో టెన్త్, ఇంటర్, డిగ్రీ అర్హత ఉన్న వారికి ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. యాకయ్య, మహేష్‌కుమార్, ఉప్పలయ్య, గౌస్, వెంకటేష్, ప్రశాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతుల ఆందోళన

నర్సింహులపేట: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో రైతులు మంగళవారం ఆందోళన చేశారు. రూ.2 లక్షల లోపు రుణం ఉన్న రైతులకు కూడా మాఫీ కాలేదన్నారు. యాకూబ్, బయ్య మహేష్, సురేష్, భాస్కర్, యాకన్న పాల్గొన్నారు.

భగవద్గీత ప్రచారం

మహబూబాబాద్ రూరల్ : మార్గశిర మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం మంగళవారం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ముత్యాలమ్మగుడి కాలనీ, శ్రీనగర్ కాలనీ, శ్రీరామాలయం వీధి, చాపల మార్కెట్ ప్రాంతాల్లో ప్రచారం చేశారు. త్రైతసిద్ధాంతం, ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షులు, సభ్యులు కృష్ణవేణి, రజిత, లలిత, సుమ, సుష్మ, హేమలత, పాపక్క, వీరస్వామి, సంయుక్త, శ్రీలత, నవ్యశ్రీ, రేఖ, స్వరూప, నిరోష, రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

చిన్నగూడూరు/గూడూరు: జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్వహించిన సైన్స్‌ఫెయిర్, ఇన్‌స్పైర్‌లో చిన్నగూడూరు మండలంలోని జయ్యారం పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి ఎర్రోజు రాఘవ ప్రదర్శించిన ఎగ్జిబిట్ రాష్ట్రస్థాయికి ఎంపికైందని ఉపాధ్యాయులు తెలిపారు. ఈమేరకు మంగళవారం ఉపాధ్యాయులు రామకృష్ణ, ఉపేందర్, శ్రీనివాస్, రమాదేవి విద్యార్థి రాఘవను అభినందించారు. దీంతోపాటు గూడూరు మండలంలోని బాలుర హైస్కూల్‌కు చెందిన ఎం.ప్రశాంత్, ఎం.ఋషికుమార్, నాగచైతన్య, అరవింద్ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనపర్చగా.. మంగళవారం హెచ్‌ఎం హరిశంకర్, గైడ్ టీచర్ దిడ్డి అనిల్‌కుమార్ అభినందించారు.